# బాకీ

— చెళ్లూరి సీతారాజేశ్వరరావు

జానికమ్మ సగం తీసిన తలుపురెక్క వెనుక శిలావిగ్రహంలా నిలబడిపోయివుంది. ఏమనడానికి నోరురాలేదు.

"ఆర్నెల్లు ఆగమన్నారు. మీరు అన్నట్లే చేశాను. ఏది నా బాకీ? మళ్లా గడువా? వీల్లేదు. ఈ తిరగడం నావల్లకాదు. జగన్నాధం అర్ధాంతరంగా పోయి నా పీకలమీదికి తెచ్చాడు. మీరు యివ్వనంటే దిక్కులేనివాడికి దానం చేసుకున్నానని నీళ్లు వదులుకుంటాను."

జగపతిరాయుడు లౌక్యం తెలిసిన మనిషి. ఆడవాళ్ళ దగ్గర ఎలా మాట్లాడాలో అతనికి బాగా తెల్సు. జానికమ్మ పాతతరం యిల్లాలు. భర్తని అవమానిస్తే అంగీకరించదు. మధ్యతరగతివాడు పెనుగులాడేది గౌరవంకోసం. దాన్ని పోగొట్టుకోడానికి సుతరామూ ఒప్పుకోలేదు.

"మీ బాకీ ఎగవేస్తానని చెప్పడంలేదు. ఏదోలా యిచ్చుకుంటాను. ఆయన పోయినప్పటినుంచి చెయ్యివిరిగినట్లయింది. అన్నీ చూసుకోవడంతో వుక్కిరిబిక్కిరిగా వుంది. తొందరలో మీ బాకీ తీర్చేస్తాను."

ఇదే సమయంలో భూపతి వచ్చాడు అతన్ని చూడగానే జానికమ్మకి వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

"రా అన్నయ్యా" సాదరంగా ఆహ్వానించింది.

భూపతి లోపలికి రాలేదు. బయట అరుగు మీదే కూర్చున్నాడు. "చుట్టరికానికి రాలేదమ్మాయ్. మీ ఆయన నాకు పన్నెండు వేలు యివ్వాలి. నీకు తెలిసేవుంటుంది. ఎన్నాళ్ళయినా నువ్వు మాట్లాడవు? గుర్తుచేద్దామని వచ్చాను."

"నీకూ బాకీ వున్నారా?" బాధగా అడిగింది.

జగపతిరాయుడు బింకంగా కూర్చున్నాడు. భూపతి కూడ తనకి తోడయ్యాడు. తన బాకీ వసూలయి తీరుతుంది.

జానికమ్మ భూపతి ఇచ్చిన ఖాతా పుస్తకాలు చూసి యిచ్చేసింది. "నన్నేం చెయ్యమంటావు అన్నయ్యా!"

"నా బాకీ తీర్చమంటాను."

"నీకు ఏది సబబు అని తోస్తే అదిచెయ్యి. నా విషయం నీకు తెల్సినదే కదా!" జానికమ్మ నిష్ఠూరంగా చూస్తూ, లోపలికి వెళ్ళిపోయింది.

జగపతిరాయుడు దగ్గరికివచ్చాడు. "ఏదోలా యివాళ తేల్చేయండి. నేను తిరగలేక యిదవుతున్నాను."

"నీకు నాలుగువేలు రావాలి కదా!"

"అవును."

భూపతి గడ్డం రాసుకుంటూ "మా భావ పేర్న యిల్లు మాత్రమే మిగిలింది. దాన్నే అమ్మించి మన బాకీలు తీసుకోవాలి"అన్నాడు.

"అలాగే చేద్దాం. మనం కోర్టుకి పోయినా అంతకంటె రాబట్టగలమా మరి?"

"ఇల్లు అమ్మగా వచ్చింది మన బాకీల నిష్పత్తిలోనే తీసుకుందాం!"

జగపతిరాయుడు అంగీకరించాడు.

ఇల్లు బేరానికిపెట్టారు. రెండునెలలు గడిచినా సరయిన బేరం ఎక్కలేదు. చివరికి పుల్లయ్య నాలుగువేలకి కొంటానని వచ్చాడు. జగపతిరాయుడు వెయ్యి తీసుకుని ఋణపత్రాలు యిచ్చేశాడు.

ఓసాయంత్రం భూపతి చెల్లెలింటికివెళ్ళాడు. జానికమ్మ ముభావంగా పలకరించింది "రేపట్నుంచి అద్దెయింటిలోకి వెళ్ళాలి కాబోలు."

"ఇది నీఇల్లు. నిన్నెవరు వెళ్ళమంటారు?"

జానికమ్మకి అయోమయంగా వుంది.

"ఇల్లు పుల్లయ్య చేత కొనిపించినట్లు నాటకం ఆడానమ్మా. జగపతికి బావ యివ్వాల్సింది వెయ్యే. అంకెలు మార్చి నాలుగువేలు చేశాడు. బాకీకోసం యిల్లు వేసుకుందామని చూస్తున్నాడు. నాకూ బాకీవున్నట్లు నటించాను. దానివల్ల వాడికి ముట్టవల్సిందే ముట్టింది." భూపతి వివరించాడు.

జానికమ్మ అన్నగార్ని ప్రశంసగాచూసింది.